కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

# పరిహారం

**దూ**సుకెళ్తున్న తెల్ల సుమో హఠాత్తుగా డెడ్ స్లో అయింది. ఏదో ట్రాఫిక్ అవాంతరమన్నమాట. చిరాకేసి డాక్టర్ సోమరాజు టైం చూసుకున్నాడు. ఇప్పటికే అర్థగంట ఆలస్యం. ఇంటెన్సివ్ పల్స్‌పోలియో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం గురించి జిల్లాస్థాయిలో సమావేశం. లంచ్ బ్రేక్‌కల్లా ముగించి ఆనక మంత్రిగారి ప్రోగ్రాంకు అటెండవ్వాలి.



రోజూ ఏదో టెన్షన్! జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారిగా పదోన్నతి వచ్చినప్పుడు కలిగిన ఆనందం ఉద్యోగం చేస్తున్నప్పుడు వుండటం లేదు. ఉద్యోగాల్లో ఉన్నత హోదాలు

గౌరవనీయమైతే కావచ్చుగాని మనస్సుకు ప్రశాంతత తక్కువ. బాధ్యతల బరువుతో పాటు రాజకీయ నాయకుల పెత్తనాలు, పైరవీలు, ప్రలోభాలు, బెదిరింపులు కత్తిమీద సాములాంటిదే!

రోడ్డుమీద ట్రాఫిక్ పోలీసుల హడావుడి తెలుస్తోంది. ఒక ప్రక్కగా నిలబడి కానిస్టేబుల్ కాషన్స్ ఇస్తూ ట్రాఫిక్‌ను మెల్లగా క్లియర్ చేస్తున్నాడు. మరో ప్రక్కన ట్రాఫిక్ సి.ఐ., ఎస్.ఐ.లు చిందులేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసు వ్యాన్ చుట్టూ జనం గుంపులు. వ్యాన్ మీదకు తోపుడు బళ్లు, కాయల బుట్టలు, తడికెలు ఎక్కిస్తున్నారు. కాళ్లావేళ్లా పడుతున్న హాకర్లను తిడ్తూ ప్రక్కకు నెట్టి వేస్తున్నారు పోలీసులు.

జీపు మెల్లగా కదుల్తోంది! డాక్టర్ సోమరాజుకి విషయం అర్థమైంది. ఆ స్పాట్ నుండి ఎంత త్వరగా బయటపడ్తామా అన్న ఆలోచన తప్ప మరో ఆలోచన లేదు.

"సారూ! ఏరోజు కారోజు బీటు కానిస్టేబుళ్లు వాళ్ల దగ్గర మామూళ్లు దండుకొంటూనే వుంటారు. నెలాఖర్లో కేసులు కావల్సినప్పుడల్లా ఇలా జులుం చెలాయిస్తుంటారు. న్యూసెన్స్ కేసులు పెట్టి బీదా బిక్కీ జనాన్ని కోర్టుల చుట్టూ తిప్పుతుంటారు. అండదండలులేని వాళ్ల పాట్లే పాట్లు సార్!" సానుభూతిగా చెప్తున్నాడు డ్రైవింగ్ సీట్లోంచి సైదారావు.

"అయ్యా! ఈ తప్పుగాయండి సారూ! పల్లెటూరోణ్ణి. ఏం తెల్వదు. బండి అద్దెకు తెచ్చిన. సాయంత్రానికప్పజెప్పకపోతే కొడ్తారు సారూ!" పోలీసుల్ని దీనంగా బ్రతిమాలు కుంటున్న ఆ వ్యక్తిని చూస్తూనే డాక్టర్ సోమరాజు జ్ఞాపకాల దొంతర కదిలినట్లయింది. ఎప్పుడో, ఎక్కడో బాగా ఎరిగున్న మనిషిలానే అగుపిస్తున్నాడు. కాని ఎవరన్నది వెంటనే జ్ఞాపకం రావటం లేదు. పోలీసులు అతని మాటలేం ఖాతరు చెయ్యకుండా ప్రక్కకు నెట్టిపారేశారు.

సుమో కాస్త ముందుకెళ్లి తిరిగి వేగాన్నందుకొని దూసుకెళ్లి పోయింది. ఆఫీసుకెళ్లే దాకా అతని గురించి సోమరాజు ఆలోచిస్తూనే వున్నాడు. ఎంత ఆలోచించినా జ్ఞప్తికి రాలేదు. ఆఫీసులో అడుగుపెట్టాక అతని గురించి ఆలోచించే తీరిక లేకపోయింది. పనుల ఒత్తిడిలో పడిపోయాడు.

మరుసటిరోజు ఉదయం ఇంట్లో పేపరు చూస్తుండగా ఆకుకూరలమ్మే మనిషొకడు వాకిటి ముందుకొచ్చి గావుకేకలు పెడ్తున్నాడు. "అమ్మగారూ! తోటకూర, చుక్కకూర, మెంతికూర, బచ్చలాకు, గోంగూర, కొత్తిమీర" అంటూ...

సోమరాజుకి సరిగ్గా అప్పుడు గుర్తొచ్చింది. ఆ ముందు రోజు కనిపించిన వ్యక్తెవరో! పాపారావు! సుమారు పదేళ్ల క్రితం ఒక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న కాలంలో కుటుంబానికంతా బాగా పరిచయమైనవాడు.

అంతస్తు, మతం, కులంతో సంబంధం లేకుండా, "అక్కయ్యగారూ" అంటూ ఆత్మీయంగా, చొరవగా తన శ్రీమతితో వరస కలిపి సన్నిహితుడైన మంచి వ్యక్తి.

ఈ స్థితిలో, ఇక్కడ ఇలా, ఇన్నేళ్ల తర్వాత పాపారావు తారసపడటం ఆశ్చర్యంగా వుంది సోమరాజుకి. మారుమూల పల్లెటూళ్లో, చెమటధారలతో మట్టిని తడిపి, బంగారు పంటలు పండించే ఓ సేద్యగాడు ఈ మహానగరంలో చిల్లరమల్లర వ్యాపారిగా ప్రత్యక్షమవడం నమ్మశక్యంగా లేదు.

ఆ ఊళ్లో పాపారావు కుటుంబం ఆకుమళ్లు సేద్యం చేయడంలో దిట్టలు. తాజాదనానికి, కమ్మదనానికి పెట్టింది పేరుగా ప్రాచుర్యం సంపాదించారు. రోజూ క్రమం తప్పకుండా పాపారావో, అతని తమ్ముడో, ఇతర కుటుంబ సభ్యులో ఎవరోఒకరు ఆకుకూరలు అమ్మకానికి తెచ్చేవాళ్లు. సోమరాజు ఇంట్లో నిత్యం ఏదో ఆకుకూర వాడే అలవాటు వల్ల వతనుగా తెచ్చి ఇస్తుండేవాళ్లు.

"అంతకిమ్మని, ఇంతకిమ్మని బేరం చేసే పన్లేదండీ! ఇదే మనం టవున్లో కొనాలంటే రెట్టింపవుతుంది" అంటూ వాళ్ల గురించి కాంప్లిమెంట్ ఇస్తుండేది శ్రీదేవి.

పెద్ద సంసారంలాగుంది. నెలలో రెండు మూడు సార్లన్నా ఇంట్లో పెద్దలకో, పిల్లలకో ఎవరో ఒకరికి బాగోలేదంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూపించుకునే వాళ్లు. జాగ్రత్తగా చూసి మందులిచ్చి పంపేవాడు సోమరాజు.

"ఏవండీ! పాపారావు రెండు వేలడుగుతున్నాడు. అర్జంటుగా విత్తనాలు చల్లాలట. బ్యాంకు వాళ్లు ఒక వారంలో లోనుగా ఇస్తామన్నారట. అందాక ఆగితే అదును తప్పిపోతుందట". శ్రీదేవి అడిగే విధానంలోనే వాళ్లకు ఇవ్వాలన్న సానుకూల ధోరణి కనబడుతోంది.

"ఊరుకాని ఊరులో డబ్బు ఇవ్వటాలూ, పుచ్చుకోవటాలూ అంత మంచిది కాదోయ్! ఉద్యోగస్థులం. లేనిపోని ప్రోబ్లమ్స్ కొని తెచ్చుకున్నట్లవుతుంది" అంటూ అయిష్టంగా సణిగాడు.

"పాపం! ఏడాది పరిచయంలో ఎప్పుడూ నోరు తెరిచి అడగలేదు. మాట తీరు, మంచితనం, నిజాయితీగల మనుషుల్లా వున్నారండీ! అప్పుగాదు, చేబదులేగా అడుగుతుంది". కాదు కూడదంటే శ్రీదేవి మనసు ఎంత నొచ్చుకుంటుందో తెలిసినవాడు గనుక కాదనలేకపోయాడు.

అన్నట్లుగానే పాపారావు వారం రోజుల్లోగా టంచనుగా రెండువేలు తెచ్చి శ్రీదేవికిచ్చాడు.

"అక్కా! మీ చల్లటి చేతుల్తో ఇచ్చారు. ఇత్తనం బీరు పోకుండా మొల్సినయ్. తొలొరస కూర తెచ్చి ముందు మీ చేతుల్లోనే పెడ్త" అంటుంటే శ్రీదేవి పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

మన కన్నా తక్కువలో వున్నవాళ్లకు చేసే సహాయాలే చిరకాలం గుర్తుంచుకుంటారని, గొప్ప కృతజ్ఞత చూపుతారని శ్రీదేవి నమ్మిన సత్యం. దానికి తగ్గట్టే పాపారావు కుటుంబం వ్యవహరిస్తుండేది. తొలికాపు కూరగాయైనా, తొలొరస ఆకుకూరైనా శ్రీదేవి బోణీ చెయ్యాల్సిందే. తీసుకున్న దానికి తూకమూ లేదు, బేరమూ లేదు. చేతికొచ్చినంత పెట్టటం, ఇచ్చినంత పుచ్చుకోవటమే గాని ఇంతని లెక్కగట్టటం లేదు.

"అయ్యగారి హస్తవాసి ఎంత మంచిదో, అట్టనే మీ చెయ్యా గొప్పగా కలిసొచ్చే చెయ్యక్కా! మీరంటుకుంటే చాలు మట్టి బంగారమవుద్ది" పాపారావు మాటలకు తెగ సంబరపడేది శ్రీదేవి.

డాక్టర్‌గారి భార్య హోదాలో పాపారావు బంధుజనుల ఇళ్లకు పెళ్లిళ్లకు, పేరంటాలకు వెళ్లి కానుకలిచ్చి వచ్చేదాకా శ్రీదేవికి సాన్నిహిత్యం ఏర్పడింది.

తోట్లపాలెంలో డయేరియా కేసులొస్తున్నాయని ఫీల్డ్‌స్టాఫ్ రిపోర్ట్ చేస్తే అత్యవసరంగా క్యాంపు వెళ్లాల్సొచ్చింది. సాయంత్రానికి గాని తిరిగి రావటానికి కుదర్లేదు.

రోడ్డు కిరువైపులా పచ్చని పంట పొలాలు. ఏవేవో పనులు చక్కబెట్టుకుంటూ రైతు కూలీ జనం. సూర్యాస్తమయ కాలంలో జీపు సాగుతుంటే చల్లటి గాలులు వంటికి హాయి కలిగిస్తున్నాయి. పట్నంలో పుట్టి పెరిగినవాడు డాక్టర్ సోమరాజు. ఉద్యోగరీత్యా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నియమించబడ్డాకగాని పల్లెపట్టులోని సహజ సౌందర్యం అనుభవంలోకి వచ్చింది కాదు.

ఉన్నట్లుండి కమ్మని సువాసన ఏదో నాసికా పుటాల్ని తాకింది. ఒక్కసారి ఊపిరితిత్తుల నిండా ధాటిగా గాలి పీల్చిబిగించి మరీ ఆ కమ్మదనాన్ని ఆస్వాదిస్తున్నాడు సోమరాజు.

"డాక్టర్ సారూ! ఆగండాగండి" అంటూ చేలమధ్యనుంచి ఇద్దరు వ్యక్తులు పరుగున వచ్చి జీపు కడ్డం పడ్డారు.

ఎవరని చూస్తే పాపారావు, అతని తమ్ముడు జోగారావు. జీపాగింది.

"కాసేపు దిగెల్లండి సారూ! ఇదే మా పొలం" అంటూ ఆహ్వానించాడు పాపారావు ఆత్మీయంగా. కాదనలేక కిందకు దిగాడు సోమరాజు. అన్నదమ్ములిద్దర్నీ అనుసరించి పొలంలోకి అడుగుపెట్టాడు.

"సారూ! ఇవేనండీ రోజు మీకు కూరలిచ్చే మా ఆకుమళ్లు" అంటూ చేతిని అర్ధచంద్రాకారంగా తిప్పి చూపేడు.

తోటకూర, బచ్చలాకు, కొత్తిమేర, పాలకూర, చుక్కకూర, కరివేపాకులతో చేనంతా మళ్లుగా పరుచుకొని వుంది. కొద్దిసేపటి నుండి నాసికాపుటాలకు తగులుతున్న కమ్మని సువాసన ఏందో తెలిసిపోయింది సోమరాజుకు. మనసారా పదే పదే గాలి పీల్చుకున్నాడు.

"బాగుందయ్యా పాపారావు! చేను చాల కుదురుగా పొందికగా బాగుంది. వరుసలు వరుసలుగా ఆకుమళ్లతో భూమిని గొప్పగా సింగారించారు. చూడ ముచ్చటేస్తున్నది" సోమరాజు నవ్వుతూ అన్నాడు.

"సార్! ఆకాశానికి చుక్కలెంత అందమో, నేలకు ఈ మొక్కలంత అందం. మీ బోటి చదువుకున్నోళ్లకు అక్షరాలు జీవనాధారమైతే మాబోటి పామరజనానికి ఈ మొక్కలే జీవనాధారం".

మాట్లాడుకుంటూ కూరమళ్ల మధ్య ఓ ఇరవై బారలు నడిచారు. ఈ మాత్రం వ్యవసాయ భూమి కాస్తో కూస్తో తనకూ వుంటే ఎంతో బాగుండుననిపించింది కొద్ది క్షణాలు. తెల్లని కాగితాల మీద నాలుగక్షరం ముక్కలు బరకటం కన్నా, ఈ నాగేటి చాళ్ల మధ్య పచ్చదనాన్ని మొలిపించటానికి ఎంత శ్రమ, నైపుణ్యం అవసరమో కదా అనుకున్నాడు సోమరాజు.

"దండం సారూ! మీ చేత్తో పింఛనుఫారం రాసిచ్చారు. నెల నెలా నూటయాభై లెక్కన ఇస్తున్నారు. మీ పేరు చెప్పుకుని తింటన్నా" వినమ్రంగా చేతులు జోడించాడు పాపారావు తండ్రి వెంకటయ్య.

"నాదేముందండీ! మీ వయస్సు ధ్రువీకరణ పత్రం రాసిచ్చాను. శాంక్షను చేసి డబ్బులిస్తుంది ప్రభుత్వం" నవ్వాడు సోమరాజు.

మగవాళ్లతో పాటు పొలంలో ఇంకా ఇద్దరు ఆడవాళ్లు పనిచేస్తున్నారు. నలుగురు పిల్లలు ఆటలాడుకుంటూ మళ్లమధ్య పరుగులు పెడ్తున్నారు. అంతా వెంకటయ్య కుటుంబసభ్యులే. నాలుగేళ్ల క్రితం వెంకటయ్య భార్య క్యాన్సర్ వ్యాధితో చనిపోయినట్లు పాపారావెప్పుడో చెప్పాడు.

"ఈ వయస్సులో కూడా మీరింకా పొలం రావల్సిందేనా? ఇంటి దగ్గర ఉండొచ్చుకదా? మా ఉద్యోగులకైతే యాభై ఎనిమిదేళ్లకే రిటైర్మెంట్. ఇంటి దగ్గర గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవచ్చు" వెంకటయ్యతో అన్నాడు సోమరాజు.

"మనిషికి పుటకిచ్చేది కన్నతల్లయితే, పొట్టనింపేది భూదేవమ్మతల్లి! బ్రతికినంత కాలం ఇద్దర్నీ తల్చుకోవాల్సిందే, కొల్చుకోవాల్సిందే గదయ్యా! మా తాతముత్తాతల నాటి నుంచి ఆకుమళ్ల సాగే! ఆకు మళ్లోళ్లన్న పేరు మా కుటుంబాలకు స్థిరపడిపోయింది.

నాకు మల్లే నా బిడ్డలూ! చీకటి ముఖాన లేస్తే ఈ కాళ్లు చేనుకేసే దారితీస్తాయి. ఈ ఆకుమళ్లవాసన తగలందే కడుపుకు ముద్దా దిగదు. కంటికి కునుకూ పట్టదు సారూ! నాకు ఉగదెల్సిన కాణ్ణించి బతుకూ ఈ మొక్కల మధ్యనే గడిచింది. అట్టనే చావూ ఈ మొక్కల మధ్యనే చావాలి!" చెప్పుకుపోతున్నాడు వెంకటయ్య.

అంతలో పాపారావు బొప్పాయి కాయొకటి ముక్కలు కోసి తెచ్చి "తినండి సారూ! ముక్కలు తేనెలా తియ్యగుంటయి" అంటూ చేతిలో పెట్టాడు.

నిజమే! అన్నంత తియ్యగానే వున్నాయనుకున్నాడు సోమరాజు. హైబ్రీడ్ మొక్కకాదని, నాటు మొక్కని ఆ విత్తనాల ప్రత్యేకతలు చెప్పాడు పాపారావు. వాళ్ల మాటలు వింటుంటే వాళ్లకు మట్టి గురించి, విత్తనాల గురించి, వాటి మొలక గురించి, మొక్కల గురించి, కాయల గురించీ ఎంత క్షుణ్ణంగా తెలిసిందీ అర్థమవుతుంది. ఈ మట్టితో, మొక్కలతో వాళ్ల జీవితాలెంతగా పెనవేసుకు పోయిందీ సోమరాజు గ్రహించగల్గాడు.

"దీంతోపాటు మీ కింకెక్కడైనా పొలంగట్రా వుందా?" అడిగాడు సోమరాజు చెయ్యికడుగుతూ.

"మా నాయన భాగానికొచ్చింది ఈ రెండున్నరెకరాలు. నీది, నాదని అన్నదమ్ములం యేర్లుపడలా! అరెకరం మా చెల్లి పెళ్లికి చదివించాం. ఏటా కవులిస్తాం" చెప్పాడు పాపారావు.

"నేను కడతేరేదాకా నా బిడ్డలిట్టానే కలిసుండాలనేది నా కోరిక. మాకు రెండెకరాల పొలం అని చెప్పేదానికి, నాకు ఎకరం పొలం అని చెప్పేదానికీ తేడా లేదంటారా సారూ?" అడిగాడు వెంకటయ్య.

ఆడుతున్న పిల్లల్ని చూస్తూ "వీళ్లేం చదువుతున్నారు?" అడిగాడు సోమరాజు. పిల్లల్ని చేరబిలిచి వాళ్ల చేతనే ఏమేం చదువుతున్నదీ చెప్పించాడు వెంకటయ్య.

"వీళ్ల హయాం కొచ్చేతలికి ఈ రెండకరాలు ముక్కలు చెక్కలవ్వాల్సిందేగా సారూ! పొట్ట తిప్పలకు చేతి కింద ఈ మడి చెక్కలతోపాటు, బడి కాగితాలూ వుంటే రెండిందాల గుట్టుగా బతుకుతారు". వెంకటయ్య ఎంత ముందు చూపుతో ఆలోచిస్తాడో తెలుస్తోంది.

ఆడవాళ్లు అప్పటికే రకరకాల కూరలు పీకి పోగులు పెట్టారు. జోగారావు ఏ రకానికారకం విడిగా పెద్దమోపులుగా కడ్తున్నాడు. రేపు ఉదయం అమ్మాల్సిన కూరలు ఇప్పుడే కోసి పెడ్తారా? అనుమానం వచ్చి సోమరాజు అడిగాడు.

"ఊళ్లో అమ్మకానికి సరిపడా కూరలుంచుతాం. మిగతాది రాత్రి లాస్ట్‌బస్‌కి టౌనుకేసి కెళ్తా. మార్కెట్‌లో దించుకుని, ఆకుకూరల్తో పాటు కందువా పరుచుకొని రాత్రంతా

పడుకుంటాం. తెల్లారగట్ల హోటలోళ్లూ, మెస్‌లోళ్లూ, తోపుడు బళ్లోళ్లూ వచ్చి కొనుక్కెళ్తారు. ఈలు బట్టి అన్నో, నేనో ఎవరోకరం మార్కెట్ కెళ్తుంటాం" వివరంగా చెప్పుకొచ్చాడు జోగారావు.

కేవలం కట్టకు రూపాయో, రెండో ఇచ్చి చవుగ్గా కొనుక్కునే ఆకుకూరల పెంపకం వెనుక ఎంత శ్రమా, నైపుణ్యం దాగుందో గ్రహించాడు సోమరాజు. పండించడం ఒక ఎత్తయితే దాన్ని మార్కెట్ చేసి లాభసాటిగా అమ్ముకోవటం మరో ఎత్తు. ఏ మాత్రం తేడా వచ్చినా నష్టం మూట గట్టుకోవాల్సిందే.

సెల్‌ఫోన్ మోగడంతో సోమరాజు ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఫోన్ మాట్లాడాక, పాపారావు కనబడిన సంగతి శ్రీదేవి చెవినేశాడు. కలిసి మాట్లాడనందుకు నిష్ఠూర మాడింది. ఏదో రకంగా సాయపడి వుండాల్సిందన్నది.

ఈ మహానగరాల్లో ఎవడిచావు వాడు చావాల్సిందేగాని, ఒకడికొకడు సహాయం చేసుకునే పాటి వెసులుబాటు ఎక్కడుంటుంది గనుక అనుకున్నాడు సోమరాజు. ఇక్కడే వుంటున్న పక్షంలో ఏదో సందర్భంలో తిరిగి తారసపడకపోడులే అన్నాడు సర్దిచెపుతూ.

అన్నట్లుగానే ఒక వారం తర్వాత, ఆదివారం సైకిల్ మీద దానిమ్మకాయల బుట్టలతో ఏకంగా ఇంటి దగ్గరే ప్రత్యక్షమయ్యాడు. పలకరించి పరామర్శించే సరికి కన్నీళ్ల పర్యంతమయ్యాడు పాపారావు. శ్రీదేవయితే ఒక దగ్గరి చుట్టాన్ని చాల కాలం తర్వాత కలుసుకున్నంత సంబరపడింది.

"ఏం పాపారావు! ఈ బుట్టలేంటి, కాయలేంటి, సైకిలేంటి, అవతారమేంటి? ఎక్కడివాడివి ఎక్కడికొచ్చావు? మీ ఊరి ఆకుమళ్లాదిలి టౌన్లో ఈ బేరాలేంటి? మీ వాళ్లంతా ఎక్కడ?" అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేశాడు సోమరాజు.

పాపారావుకి వెంటనే గొంతు పెగల్లేదు. గుండెల్లోంచి దుఃఖం ఎగదన్నుకొచ్చింది. కన్నీటి పర్యంతమయ్యాడు మనిషి, గతం ఒక విషాదాంత నాటకంలా అతని కళ్లముందు అంకాలుగా కదలసాగింది.

* * *

టవున్లో కూరలమ్మి కావాల్సిన విత్తనాలు, ఎరువులు కొనుక్కొని ఇంటి కొచ్చాడు పాపారావు. పోస్టుమేన్ గవర్నమెంట్ నోటీసంటూ పట్టుకొచ్చి, తండ్రి చేతిలో పెట్టి, వేలిముద్ర వేయించుకు వెళ్లాడు. అదేందోనని ఇద్దరి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

స్కూల్లో పని చేసి రిటైరయిన బడిపంతులు దగ్గరకు నోటీసు తీసుకెళ్లారు తండ్రీ, కొడుకులు.

"మీ పంటపొలాలకు ఎసరొచ్చిందయ్యా వెంకటయ్యా. ప్రభుత్వం మందుల ఫ్యాక్టరీ కోసం మీ భూమి స్వాధీనం చేసుకోబోతోందట. అందుకు తగిన నష్టపరిహారం చెల్లించటానికి సిద్ధంగా వుందట". టూకీగా విషయం చెప్పాడు పంతులు.

ఆ మాటలకు తండ్రీ, కొడుకులిద్దరూ జావగారి పోయారు. ఇదేం అన్యాయమంటూ గోల పెట్టారు.

"అదేంటి వెంకటయ్యా! కొద్ది నెలల బట్టీ ఇక్కడ జరుగుతున్న తంతు మీకు తెలియలేదా? ఏదో విదేశీ మందుల కంపెనీ ఫ్యాక్టరీ కోసం, మన ప్రాంతంలో వెయ్యి ఎకరాల భూమి సేకరించి అప్పగించటానికి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు పేపర్లో వార్తలు, ప్రకటనలు వచ్చాయిగా?".

"ఆ సంగతి తెలుసండి! భూములివ్వటానికి రైతులం ఒప్పుకోటం లేదుగా! మా రైతుల్ని కాదని, ఏకంగా నిర్ణయం తీసుకోడం అన్నేయం గాదూ! తరతరాలుగా ఎగసాయం చేసుకుంటున్న మా భూముల్ని బలవంతంగా గుంజుకుని, మా పొట్టలు కొడ్తారా?" పాపారావు ఆవేదన వెలిబుచ్చాడు.

"రాజు తలచుకొంటే దెబ్బలకు కొదవుంటదా చెప్పు! ప్రభుత్వం పునరా లోచించా లంటే నీ బోటి రైతులంతా ఏకమవ్వాలి. ఒక తాటి మీద నిలిచి వ్యతిరేకంగా పోరాటం చెయ్యాలి". తనకు తోచింది చెప్పాడు పంతులు.

చుట్టుప్రక్కల ఊళ్లలో నోటీసులందుకున్న రైతుల్లో అలజడి మొదలైంది. బాధిత రైతులంతా ఒకటయ్యారు. హైద్రాబాద్‌లో మకాంపెట్టున్న నియోజకవర్గ ఎమ్మెల్యేని కలవటానికి రెండు బస్సులు వేసుకుని వెళ్లారు. రైతులకు ఇంత కష్టం కలిగినందుకు ఎమ్మెల్యే విలవిల్లాడి పోయాడు. సి.ఎమ్. దాకా వెళ్లి పోరాటం చేద్దామన్నాడు. అప్పటికప్పుడు వినతి పత్రం తయారు చేయించి, ధైర్యం చెప్పిమరీ సాగనంపాడు.

ప్రభుత్వం రైతుల భూములు స్వాధీనం చేసుకునే ప్రక్రియ ముమ్మరం చేసింది. తాఖీదుల మీద తాఖీదులు. ఎమ్మెల్యేనే గాదు తమ తరఫున పోరాటం చేస్తామన్న పెద్దస్థాయి నాయకులెవరూ పత్తాలేరు. కడుపు మండి రైతులే రోడ్డెక్కారు. ధర్నాలు చేశారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఫలితంగా లాఠీఛార్జీలు, పోలీసు కేసులూ!

"ప్రభుత్వం ఇదంతా అభివృద్ధి కోసమంటుంది. ఎవరి అభివృద్ధి కోసం మా భూములు లాక్కుంటాది? కొందరు బడా బాబుల ప్రయోజనాల కోసం మాలాంటి ఎందరో బక్క రైతుల బ్రతుకుల్ని బజారు కీడుస్తారా?" అంటూ రైతు నాయకులు ఆవేశంగా ప్రశ్నించారు.

"జీవనాధారంగా వున్న భూమి పోగొట్టుకొంటే మాకు ఆత్మహత్యలే శరణ్యం" అంటూ బడుగురైతులు కంట తడిపెట్టారు.

ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం భూముల లెక్కలూ, కొలతలూ పూర్తి చేసింది. ప్రభుత్వం విలువ ప్రకారం ఎకరా లక్షన్నర్నుంచీ మూడు లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నట్లు ప్రకటన చేశారు. రైతులు నష్టపరిహారం తీసుకోవటానికి ముందుకు రాకపోతే కోర్టుకి కట్టేస్తామని బెదిరింపులు మొదలెట్టింది. కాదు కూడదని రైతులు మొండిగా న్యాయస్థానానికి వెళితే ఎకరాకి లక్షన్నర మాత్రమే వస్తుందని హెచ్చరించింది.

రైతులకు దిక్కుతోచని పరిస్థితి. నాయకుల్ని తిట్లు, శాపనార్థాలు పెట్టారు. గుండెలు బాదుకుంటూ ఏడ్చారు. అంతా అరణ్యరోదనైంది. ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకోవటం మొదలెట్టింది. కూడు,- నీళ్లూ ముట్టకుండా రైతులు కుమిలి పోతున్నారు.

రోజూ ఇంటిముందు వీధరుగుమీద ప్రక్క పరుచుకొని పడుకునే వెంకటయ్య ఆ రోజు తెల్లారేసరికి అరుగు మీద కనిపించలేదు. పది బారల పొద్దెక్కినా అయిపు లేకపోయేసరికి ఊరంతా గాలించారు. ఎవరి కంటికీ కనబడింది లేదు. రెండు రోజులు పొలాలు, పుట్టలూ గాలించినా ప్రయోజనం లేక పోయింది. చివరకు వెంకటయ్య శరీరం చేలోని మోటబావిలోనే శవమై తేలింది.

వెంకటయ్య చావు రెండ్రోజులపాటు వార్తాపత్రికలకు, మీడియాకు, ప్రతిపక్షాలకు మంచి ప్రచార వస్తువైంది. మూడోరోజుకల్లా ఆ విషయమే మరుగున పడిపోయింది.

నింగి నేలా దప్ప మరో దిక్కు చూడని మట్టి మనుషులు. పంటల తెగుళ్ల గురించి దప్ప రాజకీయాల కుళ్లు తెలీని అమాయకపు జనం. ఎన్నాళ్లని పోరాటం చేస్తారు? రైతులు మానసికంగా కృంగిపోయారు. అలసిపోయారు. బాధిత రైతుల పక్షాన నిలవాల్సిన నాయకులు ఏ ప్రలోభాలకు లొంగిపోయారో, సమయానికి ముఖం చాటేశారు. ఇచ్చిందే దక్కుదలనుకొంటూ రాజీపడి డబ్బుకోసం బారులు తీరారు.

రైతులకిచ్చే సొమ్ములో లక్షకు పదివేల రూపాయలు కోత పెట్టారు. ఇదేం లెక్కంటూ గోలగా అడిగారు. అది ఆదాయపు పన్ను కింద మినహాయించారన్నారు. మేం మా పొలాల్ని లాభాల కోసం అమ్ముకోలేదంటూ గుండెలు బాదుకున్నారు. ఈ పాయింటు గురించి ప్రభుత్వం పునరాలోచన చేస్తుందని నమ్మబలికారు చోటామోటా నాయకులు, అధికారులు.

కోల్పోయిన భూమికి బదులుగా నష్టపరిహారం చేతికందిన అన్నదమ్ములు బ్యాంకు రుణాలు, చిల్లరమల్లర బాకీల కింద కొంత జమ చేశారు. కొందరు రైతులకైతే, బాకీల వాళ్లు ఎగబడి గుంజుకోవటంతో చేతిలో చిల్లి గవ్వ మిగల్లేదు. చెల్లెలి పసుపు కుంకుమల కింద ఇచ్చిన యాభై సెంట్ల సంగతి లెక్క తేల్చమని బావ పాపారావుని నిలదీశాడు. గవర్నమెంటు గట్టిన లెక్కతో తనకేం సంబంధంలేదని, పెళ్లిరోజు నాటికి భూమికి వున్న మార్కెట్ విలువ ప్రకారం లెక్కగట్టి ఇవ్వాలంటూ పేచీకి దిగాడు. ఆడపిల్ల ఉసురు పోసుకోవటమెందుకని బతిమాలి, బామాలి చెల్లెలికి కాస్త అదనంగానే సర్దుబాటు చేశారు. ఈ విషయంలో అన్నదమ్ముల మధ్య భేదాభిప్రాయాలొచ్చి మాటా మాటా పెరిగింది. ఎడముఖం పెడముఖమయ్యారు. మిగిలిన డబ్బు, ఇంతని వాటాలేసుకుని పంపకాలు చేసుకున్నారు. కుంపట్లు వేరయ్యాయి.

రైతులు ఊళ్లో కడ్తున్న క్రొత్త ఫ్యాక్టరీ పనుల్లో కూలీలుగా చేరారు. చేతగాని పనుల్లో తలదూర్చి కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. క్రొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి రెండేళ్లు పట్టింది. గతంలో వాగ్దానం చేసినట్టుగా బాధిత రైతుల కుటుంబాలకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలిమ్మన్నారు. కంపెనీ అవసరాలకు తగ్గట్లు నైపుణ్యంలేని వాళ్లకు ఉద్యోగాలెట్లా ఇస్తామంటూ అడ్డం తిరిగారు. భూములు కోల్పోయిన రైతులు తిరిగి భూములు, పాడిగేదెలు కొనుక్కొనేందుకు ఇస్తామన్న రుణాలు, రాయితీల సంగతేందని ప్రభుత్వాన్నడిగారు. దరఖాస్తులు తీసుకోవడం తప్ప, చేసిన సాయం శూన్యం.

రైతుజనం ఎటన్నా దూర ప్రాంతాలకు వెళ్లి చేతిలో మిగిలిన డబ్బుతో కుంటో, సెంటో కొందామని ప్రయత్నిస్తే అమ్మబోతే అడవి కొనబోతే కొరివన్నట్లయింది. ఎకరం భూమి అరేడు లక్షలకు పైనే పలుకుతోంది. గవర్నమెంట్ ఇచ్చిన పరిహారం కాస్తా హారతి కర్పూరంలా క్రమంగా హరించుకు పోయింది. పొట్టతిప్పలు కోసం రైతులంతా చెట్టుకొకరు, పుట్టకొకరన్నట్లుగా దేశంమీద పడ్డారు.

పల్లెటూళ్లను ఆశ్రయించిన రైతులు చివరకు రైతు కూలీలయ్యారు. పట్నాలకు చేరిన వాళ్లు రోజూవారీ పనులు చేసుకుంటూ దినసరి కూలీలుగా మిగిలారు. ఫ్యాక్టరీ కోసం నిక్షేపంలాంటి పంట భూములతో పాటు వాళ్ల బ్రతుకుల్నీ లాక్కొని బజారుపాలు చేశారు.

* * *

పాపారావు జరిగిన విషయాలన్నీ జ్ఞాపకం చేసుకుంటూ, కుమిలి కుమిలి ఏడుస్తూ చెప్తుంటే డాక్టర్ సోమరాజు మనసు బాధతో బరువెక్కింది.

ఒకప్పుడు ప్రపంచమంతా ప్రజలు, వాళ్ల మౌలిక అవసరాల గురించిన ఆలోచనలు చేసేది. మానవ వనరుల సద్వినియోగానికి ప్రణాళికలు రచించేది. కాని నేడు యావత్ ప్రపంచం వ్యాపారం, వాణిజ్యమంటూ మానవ వనరుల్ని నిర్లక్ష్యం చేస్తూ, నిర్వీర్యం చేస్తున్నది. మనిషికీ మనిషికీ మధ్య ఆర్థిక అంతరాలను పెంపుచేస్తున్నది. మనుషుల్లో బలీయం కావాల్సిన మానవత్వం మంటగలుస్తూ, వ్యాపారతత్వం బలిసిపోతున్నది. ఈ పరిస్థితులు ఎంత విషపరిణామాలకు దారితీస్తాయో ఆలోచిస్తున్నారా?

ఆర్థికాభివృద్ధి కోసం వాణిజ్య మండళ్లు, ఐ.టి. పార్కులంటూ లక్షలాది ఎకరాల పంట భూముల్ని ప్రైవేటుపరం జేస్తున్నారు. పరాయి దేశస్థులకు సూదిమొన మోపినంత భూమి ఇవ్వమన్న వాళ్లే, వేలకు వేల ఎకరాలు బహుళజాతి సంస్థలకు స్వాధీనపరుస్తున్నారు. పరిశ్రమలే జాతి సర్వస్వమనుకుంటే, పాడి పైరు పంటల మాటేంటి? ప్రజల ఆహార అవసరాల పరిస్థితేంటి?

"ఇదిగో పాపారావు! ఇటొచ్చినప్పుడల్లా కనపడెళ్లు. జయంతిని, పిల్లల్ని అడిగానని చెప్పు. ఒకసారి అందర్నీ ఇంటికి తీసుకురా". వెళ్తున్న పాపారావుతో అంటున్నది శ్రీదేవి.

ఏండ్లతరబడి ఏడ్చి ఏడ్చి ఎర్రబారిన రైతుల కనుగుడ్లలా, నా ముందు శ్రీదేవి పాపారావు దగ్గర కొన్న దానిమ్మకాయల రాసి కనబడ్తోంది.

"దానిమ్మకాయలో... దానిమ్మకాయలు" వీధిలో అరుస్తూ వెళ్తున్న పాపారావు గొంతులో అప్పటి ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం ధ్వనించడం లేదు. ఒక పరాజిత స్వరం మాత్రమే జీరగా, దీనంగా వినిపిస్తున్నది డాక్టర్ సోమరాజుకి.

*(ధ్యాన మాలిక, నవంబర్ 2008)*